


# నేను అననిజమే

–డా॥ కె.వి.గోవిందరావు

అనుకోని అదృష్టం తోసుక వస్తున్నందుకు తబ్బిబ్బై ఆ రాత్రి అంతా తీయని కలలుగన్నాను. కళ్ళు మూతలు పడేటప్పటికి పన్నెండు దాటినా, ఎంచేతో తెల్లవారక ముందే మెళుకువ వచ్చింది.

మరి ఆనాడు నేనొక ఉద్యోగినైపోతున్నాను. వెతికి వెతికి వేసారిపోయిన అదృష్టం అందలాన్నెక్కిచ్చింది. భవిష్యత్తును గురించి ఆలోచించగా పాశుపతాస్త్రాన్ని జయించినంత గర్వం కూడా తొణికింది నాలో.

అసలు ఈమాత్రం ఘనకార్యం నా జీవితంలో జరుగుతుందని నేనెన్నడూ ఊహించలేదు. పట్టభద్రుడనయాక ప్రతి అంగుళం జీవితాన్ని నిరాశే కప్పివేసింది గనుక. అభిమానం దెబ్బతిని, కడుపు కాలి పనికోసం నాలుగేళ్ళు పనిగట్టుక తిరిగిన తరువాత, ఈ ఉద్యోగం దొరికే అవకాశం హఠాత్తుగా ఊడిపడింది.

వాస్తవం వప్పుకోవలసి వస్తే ఈకాస్త విజయానికీ నా ప్రయత్నమేమీ అక్కరకు రాలేదు. అనుకోకుండా శర్మ వీధిలో కనిపించి భుజం తట్టి 'రవీకేఫ్‌లో తొమ్మిదవ నెంబరు గదికెళ్ళు...'' అంటూనే చకచకా వెళ్ళిపోయాడు. 'శర్మా'- అన్న కేక ఎదురుగాలిలో మళ్ళీ నాకు మాత్రమే వినిపించింది.

ఉన్న వేదనకు మరొక ఆవేదన తోడైంది. శర్మ నన్ను మంచి 'సస్పెన్సు'లో వదిలే శాడు. ఎందుకో, ఏమిటో చెప్పకుండా రవీకేఫ్‌కు వెళ్ళమని - చెప్తూ పారిపోయిన - వాడి మనస్తత్వం నాకేమీ అర్థం కాలేదు. కోపంలో శర్మ చెప్పిన విషయాన్ని నమిలివేసి ఆకలి బుసలు కొట్టగానే అదే విషయాన్ని నెమరు వేసుకుంటూ ముందుకు నడిచాను.

నీరసంగా ఆలోచిస్తున్న నేను నడుస్తున్న దప్పికై రోడ్డు మీద నిలబడిపోయాను. దాహం తీర్చుకోడానికి దగ్గర్లో ఏదైనా హోటలుందేమోనని. ఆశ్చర్యం. నాకు కుడిప్రక్క ఎదురుగా రవీకేఫ్! నాలో నేను నవ్వుకున్నాను. మాయాబజారు సినిమా చూస్తు న్నట్లనిపిం చింది. దప్పిక మరచిపోయాను. ఏదో ఉత్సాహం ఉరకలు వేసింది. ముందుకు వడిగా వెళ్ళాను. కానీ సందేహాలు కాళ్ళకు సంకెళ్ళు వేశాయి. నేనెందుకు 'రవీకేఫ్' లోపలకు వెడుతున్నాను? ఆ గదిలో ఎవరుంటారో? వెళ్ళి ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి? కానీ సందేహం మీద ఉత్సాహం దండయాత్ర చేసి జయించింది. గబగబా హోటలు మేడమీదకు వెళ్ళి ఒక గది దగ్గర ఆగి చూసాను. తొమ్మిదవ నెంబరు. నాలో నేను ఏదో ఆలోచించుకుంటుం డగానే లోపల వున్నాయన నన్ను చూసి సౌంజ్ఞ చేశాడు. లోపలకు వెళ్ళాక కూర్చోమన్నాడు.

ఆయన కళ్ళద్దాలు సవరించుకుని, "దరఖాస్తు దార్లందరకూ పోస్ట్‌బాక్సు అడ్రసు ఇచ్చాను. మరి మీరు నేరుగా ఎలా వచ్చారు?'' అన్నాడు.

నాకు ముచ్చెమటలు పోశాయి. కథ ఏ అధ్యాయంలో వుందో, సుఖాంతమో, విషాదాంతమో పోల్చుకోలేకపోయాను. కానీ తడుపుకోకుండా, మెత్తబడకుండా నటించడం మాట్లాడడం నాకు అభిమాన కళ.

"నా స్నేహితుడొకడు చెప్పాడు - ఇలా మీకు అసౌకర్యం కలిగించినందుకు క్షమించాలి'' అన్నాను.

నాముఖ కవళికలను పరిశీలిస్తూనే "ఫరవాలేదు. మా కంపెనీకి మీవంటి ప్రోత్సాహవంతులే కావాలి!'' అన్నారు.

"థాంక్యూ సార్".

"దరఖాస్తు తెచ్చారా?''

బి.ఎ. పాసయిన దగ్గరనుంచీ రెడీమేడ్ దరఖాస్తులు ఎక్కడకు వెళ్ళినా జేబులో మోసుకువెళ్ళడం అలవాటుగా పెట్టుకున్నాను. టక్కున జేబులోంచి తీసి-

"తెచ్చాను సార్. కానీ...." నీళ్ళు నమిలాను.

"ఓ అదా" చిన్న విజిటింగ్ కార్డు నాకు ఇచ్చారు ఇదే మా కంపెనీ-పేరు చూసి దరఖాస్తులో వ్రాసి ఇవ్వండి!

కలం మూసి దరఖాస్తు ఆయన చేతికి ఇస్తూ నమ్రతగా లేచి నిలుచున్నాను. ఒక్క క్షణం ముత్యాల కోవలా పరుగెత్తిన నా దస్తూరి చూసాడు.

దరఖాస్తు ఫైల్లో పెట్టుకుని, పైపు ముట్టించుకుని పొగ వదులుతూ "సరే వెళ్ళు. రేపు ఉదయం పది గంటలకు నన్ను చూడండి. కానీ పది గంటలంటే పదిగంటలే సుమా! హెచ్చరిక చేశాడు. చల్లగా బయటపడి కళ్ళు నులుముకున్నాను. అంతా వాస్తవమే.

* * *

మరునాడు తొమ్మిది గంటలకల్లా ముస్తాబయ్యాను. రైలు టికెట్టుకు ఐదు రూపాయల కోసం పెట్టి అంతా గాలించాను. ఊహూ... మనసులో చికాకు, వస్తువుల చిందరవందర. అవసరానికి పైసా కూడా కనిపించలేదు. ప్రక్క గదుల వాళ్ళు తాళాలు వేసుకుని ఎక్కడికో వెళ్ళారు. ఏం చేయాలి, ఎలా పోవాలి - అన్నవి నాకు యక్ష ప్రశ్నలు.

ఒక్కొక్కప్పుడు ఎన్ని రూపాయల బలం ఉపయోగించినా ఉద్యోగం దొరకదు. కానీ ఇప్పుడీ ఐదు రూపాయలు వచ్చే ఉద్యోగాన్ని ఊడగొట్టేట్లుగా ఉంది.

కాలుగాలిన పిల్లిలా తిరిగాను. తొమ్మిదింబావు అయింది. గదికి తాళం వేసి స్టేషన్ దాకా వచ్చాను. పార్కుస్టేషన్ వంక వెళ్ళే ఎలక్ట్రిక్ రైలు వచ్చే వేళయింది. మళ్ళీ నాలో ఆలోచన, ఆవేశం పెనవేసుకున్నాయి. ఏమీ తోచక చూస్తున్నాను.

నా ఎదుట ఒక గ్రుడ్డి బిచ్చగాడు నిలుచుని చిరునవ్వులొలకబోస్తున్నాడు. నా దృష్టి అతన్ని ఆకర్షించింది. దగ్గరగా వెళ్ళాను. పాపిష్టి కళ్ళు పాత డబ్బాను పరిశీలించాయి. నాలో ఒక దుర్మార్గపు ఆలోచన మెరిసింది. కానీ నేను కంపించిపోయాను. సిగ్గుపడి ముఖం చిన్నబుచ్చుకున్నాను.

రైలు కేక వినిపించింది. అవసరం నాలో రంకె వేసింది. నా కళ్ళు ఆత్రంతో అటూ యిటూ చూసాయి. నోరు చిల్లర అంది. నావేళ్ళు పాత డబ్బాలోంచి ఐదు రూపాయలు తీసాయి. హుందాగా ఒక్క పదిపైసా డబ్బాలోపలపడి శబ్దం చేసింది. మరుక్షణంలో రైలుపెట్టెలోని జనంలో త్రోవ చేసుకున్నాను. రైలు కేక వేసింది. బిచ్చగాడు చిరునవ్వు లొలకబోస్తూనే ఉన్నాడు.

* * *

నేను తొమ్మిదవ నెంబరు గదిలోకి వెడుతుండగా టవర్ క్లాక్ పదిగంటలు కొట్టింది. ఆయన అంతా గమనించి "మీరు నాకు అన్ని విధాలా నచ్చారు". నా చేతికి అప్పాయింట్‌మెంట్ ఆర్డరు, ఒక మూసిన కవరూ ఇచ్చాడు. "మీకొక నెల జీతం అడ్వాన్సుగా ఇచ్చాను. నాలుగు రోజులలో ఉద్యోగంలో చేరండి" అన్నాడు. సంతకం చేసి సలాం కొట్టి బయటపడి రైలు అందుకున్నాను. కేరింతలు కొడుతున్న నా మనస్సులో బిచ్చగానికి తప్ప మరి దేనికీ స్థానం దొరకలేదు.

అక్కడికీ మళ్ళీ వెళ్ళాను. గుడ్డి బిచ్చగాడు డబ్బా కదిలించి శబ్దం చేస్తూ ప్రయాణీకుల దృష్టిని తన వంక మరల్చుకుంటూ చిరునవ్వులొలకబోస్తున్నాడు.

నా మేధస్సును ఆలోచనలు చుట్టుముట్టాయి. నేను పెద్ద తప్పే చేశాను. కానీ చెడ్డ మనసుతో కాదు. జీవితంతో కుస్తీ పడుతున్న దురదృష్టాన్ని ఓడించడానికి. ఆకలి దప్పుల నుంచి ఒక జీవిని రక్షించుకోవడానికి.

నా తొందరపాటు పనివల్ల ఎవరైనా నష్టపడినా, ఆ నష్టపడిన బిచ్చగాడు నా ఎదుటే వున్నాడు. పోనీ జరిగిందంతా ఆ బిచ్చగానికి చెప్పి క్షమాపణ కోరుకుంటే? అతని నెలరోజుల సంపాదన ఒక్కసారిగా ఇచ్చి వేడుకుంటే?-

ఊహూ... అలాంటి అమాయకుని వద్ద నాకథ చెప్పుకోడం వల్ల అతనికి మేలుకు బదులు కీడు జరుగుతుందన్న భయం వేసింది. అతను అంధబిక్షువు. వేళకు దొరికిందాంతో సంతృప్తిపడి చికాకు లేని జీవితాన్ని నడుపుతున్నట్లు అతని ముఖం చెబుతున్నది. అలాంటి వానికి నేనొక కొత్త సమస్యను ఎందుకు కల్పించాలి?

పోనీ మాట్లాడకుండా వెళ్ళి ఆ డబ్బాలో కొంత డబ్బు జారవేసివెళితే? ఈ పద్ధతి అనుసరిస్తే ప్రపంచమంతా అనాథ బిక్షువు మీద దూసుకుపడుతుంది. ఏదో ఒక అవయవం లోపించి బ్రతకలేక బ్రతుకుతున్న వాళ్ళకు కూడా పదిపైసలు దానం చేయని ఈ కటిక రోజుల్లో నేను పెద్ద మొత్తాన్ని ముట్టచెప్పటం ప్రమాదానికి దారి తీయవచ్చు. ఒకవేళ నేను చేస్తున్న పని బిచ్చగాడే తెలుసుకోవడం తటస్థిస్తే అతడు చకితుడై కారణం తెలుసుకునేందుకు తహతహలాడుతాడు. అప్పుడైనా అసలు విషయం చెప్పక తప్పకపోవచ్చు.

అతనికి వీలైనంత తక్కువ నష్టం కలిగించే మార్గం ఆలోచించాను. మెదడులో మెరసిన నిర్ణయం నన్ను వడివడిగా నడిపించింది. ఆ అంధబిక్షువును సమీపించి మెల్లగా ఆ పాత డబ్బాలో నూరు రూపాయలు వేసి దూరంగా వచ్చేశాను.

నా అసంతృప్తిని అనుమానం రెచ్చగొట్టింది. కొంచెం దూరంగానే నిలుచుని ఆ బిక్షువును పరిసర వాతావరణాన్ని గమనిస్తున్నాను.

అతనా డబ్బాలో ఎంత వున్నదీ, ఏమున్నదీ చూసుకోలేదు. దీపాల వేళకు డబ్బాలో ఎంతవుంటే అంత తనకు ప్రాప్తించిందని తృప్తి పడడం అతని అలవాటని బోధపడింది.

అతడు ప్రశాంతంగానే తన పని సాగిస్తున్నాడు. కాస్సేపటికి ఒక మూల నుంచి ఓ పోలీసు వెతుక్కుంటూ వచ్చి అతని దగ్గర ఆగాడు. పాపాన్ని లెఖ్ఖ చేయకుండా పరుగులు తీసే అతని మనసులో ఏం మెరిసిందో, బిచ్చగాని పాతడబ్బా పరిశోధించాడు. ఉషారుగా తల ఎగురవేసి అంధునితో అన్నాడు.

"ఒరేయ్ ఇదేం పొయ్యేకాలంరా?"

అంధుడు పోలీసాయన అలికిడి, గొంతు గుర్తించి అన్నాడు, "అదేమిటయ్యా. సందీవేళ అట్టా తిడుతారు."

పోలీసు వికటంగా నవ్వాడు.

"అడుక్కోడం మానేసి జేబులు కొడుతున్నావా?"

"ఆ...." బిక్షగాడు వణుకుతున్నాడు.

నా వొళ్ళు మండిపోతున్నది. కానీ మనస్సు ముందుకు తోస్తున్నది, హృదయం - "నీవు కల్పించుకుని ఆ బిక్షగాడికి మరింత చికాకు కలిగిస్తావా?" అని వారిస్తున్నది. నేనీ యుద్ధంలో ఓడిపోయాను.

పోలీసు మళ్ళీ అందుకున్నాడు.

"ఔను... రోజంతా వాపోయినా పది రూపాయలు దొరకని నీకు వంద రూపాయలెక్కడియ్?"

"రూపాయలా?"

"కాదు పైసలు" పోలీసు డబ్బాలోని వంద రూపాయలు నోటు సొంతం చేసుకునిపోతూ గదమాయించాడు. దొంగ వెధవా - చూడ్డానికి కళ్ళు లేకపోయినా ఎన్ని జిత్తులు? ఒక్కసారి స్టేషను గాలిసోకితేగాని నీ రోగం కుదరదు!"

అంధుడికి ఏమీ అర్థం కాలేదు. ఉదాసీనతగా నిలుచుని ఆలోచనలో పడ్డాడు. కేకలు వేసి డబ్బా చప్పుడు చేయడం ఆపేశాడు. పెదిమల మీద వెలసే చిరునవ్వు అలసిపోయింది.

అడుగుల్లో అడుగులు వేసుకుంటూ అంధుని దగ్గరకు వెళ్ళాను. ఇంకా అతని ముఖంలో చిరాకు తొంగి చూస్తూనే ఉంది. అతని అభిమానం దెబ్బతినడాన్ని గమనించి నేనెంతో బాధపడ్డాను. అతనిలో అనవసరమైన చికాకు కలగడానికి కారకుడిని నేనే కదా!

మరీ దగ్గరగా వెళ్ళి "అట్లా వున్నావేం తాతా! పోలీసు ఏమిటి అంటున్నాడు?" అన్నాను.

అంధుడు క్షణంలో ముఖకవళికలు మార్చుకున్నాడు. ఉల్లాసంగా నావంక తిరిగి అన్నాడు.

"ఈ దనుడు కూడా తమ సానుభూతి పొందగలిగాడా? తమరు ఎవరయ్యా?" అంటూ నేను సమాధానం చెప్పకముందే ముగించాడు. "ఆ... ఆ పోలీసా... నా డబ్బాలో ఏదో దొంగ సొమ్ము వుందని బెదిరించి తనొక దొంగై దొరలా వెళ్ళాడు."

అంధుడు నిండారిన అనుభవంతో తొణికిసలాడుతున్నాడు. ఎంత చక్కగా సమాధానం చెప్పాడు. అతని హృదయపు లోతులు ఒక మాత్రానా మానవమాత్రుడికి అర్థం కావనుకున్నాను.

సానుభూతి ప్రకటించాను. "పాపం ఏ ధర్మాత్ముడో ఇచ్చి ఉంటాడు. ఆ డబ్బంతా వాడి పొట్టన పెట్టుకున్నాడు!"

ఈ దెబ్బతో అంధుడిలోని అహం బుసలుకొడుతుందనుకున్నాను. కానీ అంధుడు తొణకలేదు. సన్నగా నవ్వి ఒక్క క్షణం ఆగి అన్నాడు, "పోలీసు చేసిందాంట్లో - న్యాయశాస్త్రాన్ని పక్కకు పెడితే - నాకేం తప్పు కనిపించడం లేదు!" కొంచెం తల ఎత్తి గంభీరతను సూచించాడు, "అనవసరంగా వున్న డబ్బు అవసరమైన వాళ్ళు తీసుకువెళ్ళారు. ఐనా ఆ ధర్మాత్ముడెవరో అంత డబ్బెందుకు దానం చేయాలి? పదిరూపాయలు వేస్తే నాకొక రోజు గడుస్తుంది. కానీ మితం తప్పి అన్ని రూపాయలు నా పరమైతే - మరునాడు నేను చేయవల్సిన పనేమిటి? సోమరి దేవతతో సరసాలాడడం తప్ప".

నా ప్రాణం గతుక్కుమంది. అతని ప్రశ్నలకు నాకేం సమాధానం దొరకలేదు. ఆలోచిస్తూనే అనాలోచితంగా అడుగువేశాను. "ఔను, అదీ నిజమే" అన్నది నామనసు.

అంధుడు చిరునవ్వులొలకబోస్తున్నాడు. డబ్బా మ్రోగించి ప్రయాణీకులను ఆకర్షిస్తున్నాడు. *